Mana Telangana D-07/05/18



# మహిళల భద్రతే మెట్రో ధ్యేయం

- ఢిల్లీ తరువాత హైదరాబాదే
- మెట్రోలో మొదటి బోగిని మహిళలకు కేటాయింపు
- నేడు రైళ్లల్లో లేడీస్ కోచ్‌లు ప్రారంభం



మన తెలంగాణ/హైదరాబాద్/సిటీబ్యూరో : మహిళల భద్రతే మాధ్యేయమని మెట్రో అధికారులు పేర్కొంటున్నారు. ప్రతి రోజు ఎక్కడో ఒక చోట మహిళలు అత్యాచారానికి గురవుతున్న విషయం మనం వింటూనే ఉన్నాం. అందులోను హైదరాబాద్ వంటి మహానగరాల్లో వేదింపులకు గురవుతున్న మహిళల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. ఈ మధ్య కాలంలో గత నెల రోజులుగా మహిళలపై వేదింపులు, అత్యాచారాలు జరిగిన సంఘటనలు మీడియాలో వార్త కథనాలు కోడైకూస్తున్నాయి. పని చేసే చోట, కార్యాలయాల్లో, కళాశాలల్లో, ట్రైన్లు, సినిమా హాళ్లు, బస్సుల్లోనో ఇలా ప్రతి చోట ఈ మధ్య కాలంలో మహిళలపై వేదింపులు ఎక్కువగా జరుగుతున్నాయి. దీనిని అరికట్టడానికి మహిళలకు పూర్తి భరోసానిస్తూ మెట్రో అధికారులు సరికొత్త నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగానే మెట్రో రైళ్లలో మహిళలకు ప్రత్యేక బోగిని కేటాయించారు. నేటి (సోమవారం) నుంచి మహిళలకు ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. మహిళలకు ప్రయాణంలో ప్రాధాన్యం ఇస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు మెట్రో అధికారులు పేర్కొన్నారు. మహిళల భద్రతే తమ ధ్యేయంగా మహిళల కోసం అన్ని రైళ్లలో ఒక ప్రత్యేక కోచ్‌ను అందుబాటులోకి రానుంది. ఈ సేవలను అందిస్తున్న నగరాల్లో హైదరాబాద్ స్థానం రెండవది. ఈ నిర్ణయంతో ఈవ్‌టీజర్ల నుంచి పూర్తిగా రక్షణ కల్పించినట్లేనని మెట్రో అధికారులు తెలుపుతున్నారు. ప్రతి మెట్రో రైల్లో ఉన్న మూడు కోచ్‌ల్లో ముందున్న మొదటి కోచ్‌ను మహిళా కోచ్‌గా పరిగణించవలసి ఉంటోంది.

## ఢిల్లీ తరువాత హైదరాబాదే...

మహిళా ప్రయాణికులకు తగిన ప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేక కోచ్‌ను మెట్రో అధికారులు ఏర్పాటు చేయడాన్ని మహిళ ప్రయాణికులు హర్షిస్తున్నారు. ఢిల్లీ, బెంగుళూరు, చెన్నై, ముంబాయి, కలకత్తా నగరాల్లో మెట్రోరైలు సేవలు అందుబాటులో ఉన్నాయి. అయితే మెట్రో రైళ్లలో మహిళల కోసం ప్రత్యేక కోచ్‌లను మొదట ఢిల్లీ మెట్రోరైలు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఢిల్లీ తరువాత ఇప్పుడు మన హైదరాబాద్‌లో ఈసేవలు అందుబాటులోకి వచ్చాయని మెట్రో ఎండి ఎన్వీఎస్.రెడ్డి తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు సగం సీట్లు ఏర్పాటు చేశారు. ఆతరువాత గ్రేటర్ ఆర్టీసీ పరిధిలో తిరిగే లోకల్ బస్సుల్లో గ్రిల్‌ను ఏర్పాటు చేసి ముందు సగ భాగం మహిళలకు రెండవ సగ భాగం పురుషులకు కేటాయించారు. అలాగే ఎంఎంటిఎస్ రైళ్లల్లోనూ ప్రత్యేక కోచ్‌లను ఏర్పాటు చేశారు. సరికొత్త హంగులతో పర్యావరణ హితంలో ముందున్న హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు తనవంతు సామాజిక బాధ్యతగా మహిళా ప్రయాణికుల కోసం ప్రత్యేక కోచ్‌లను 19రైళ్లలో కల్పించారు.

## మహిళల సేఫ్టీ ముఖ్యం : మెట్రో ఎండి, ఎన్వీఎస్.రెడ్డి

మహిళల భద్రతే ముఖ్యం. మహిళా ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని మెట్రో రైళ్లలో లేడీస్ కోచ్‌లను ఏర్పాటు చేశాం. ఢిల్లీ తరువాత, హైదరాబాద్ మెట్రోలోనే ఇలా ఏర్పాటు చేస్తున్నాం. భద్రతను కల్పించడంతో పాటు మెట్రో రైళ్లలో భరోసా ప్రయాణం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా ఈవ్‌టీజర్ల నుంచి రక్షణను కల్పించినట్లే. ఇంతే కాకుండా మెట్రోలో ప్రయాణించే మహిళా ప్రయాణికుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటోంది.